# పరివర్తన

-ఎనుగంటి వేణుగోపాల్



రవిచంద్ర తెగ హడావిడి పడిపోతున్నాడు.

ఆరోజు చెల్లెలికి పెళ్ళిచూపులు, చెప్పినే టైంకే అబ్బాయి, పేరెంట్స్, మధ్యవర్తి నలుగురూ దిగారు.

అబ్బాయి తండ్రి మూర్తి రవిచంద్ర ఒకర్నొకరు చూసుకుంటూ ఇద్దరూ షాక్ అయ్యారు. వరుల ఫోటోలు చూపించి ఈ పెళ్లి చూపులు అరేంజ్ చేశాడు తప్ప కుటుంబనేపథ్యాలు ఇరువర్గాలకి తెలియపర్చలేదు. అదీ కారణం! గతంలోకి వెళితే..

* * *

సూర్యనారాయణమూర్తి పిఎఫ్ ఆఫీసుకి రావడం ఇది నాలుగవసారి. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫీసర్‌గా పన్చేసి రిటైర్ అయ్యాడా యన. అతడ్ని చూస్తూనే ముభావంగా ఉండిపో యాడు చెక్కుల డెలివరీ సెక్షన్ క్లర్క్ రవిచంద్ర.

"ఏంసార్? ఆ కాగితం తెండి, ఈ కాగితం సరిగా లేదు అంటూ ఎన్నిసార్లు తిప్పుతారు. ముస లిప్రాణం తిరగలేకపోతున్నాను'' ఎదురుగా కూర్చుంటూ సౌమ్యం ప్రదర్శించాడు.

"ఫార్మాలిటీస్ కదండీ! మీరు సబ్మిట్ చేసిన పేపర్స్‌లో ఏదీ సవ్యంగా లేకపోయినా నా సర్వీస్‌కి బ్యాడ్ పీరియడ్ అవుతుంది. మీకోసం నేనెందుకు రిస్క్ తీసుకోవాలి?'' చెప్పాడు రవిచంద్ర.

"మీరిస్క్‌కి ఏమైనా పర్సనల్ పేమెంట్ ఉంటే చెప్పండి చెల్లించుకుంటాను''

"ఎంతిస్తారు?''

'మీరేటెంతో?''

"నాకంటే మీకే బాగా తెలిసుండాలి. సీనియర్ ప్లస్ అనుభవజ్ఞులు కదా!'' వెటకారం ధ్వనించింది రవిచంద్ర స్వరంలో.

"ఎన్నేండ్ల సర్వీసుందేంటీ? చాలా తెలివిగా మాట్లాడుతున్నారు''

"ఆరునెలల క్రితమే పోస్టింగ్ వచ్చింది. అయి తేనేం అనుభవజ్ఞులతో వ్యవహరించడానికి తెలివితే టలతో పనేం లేదు''

"కొత్తగా జాయినయ్యానంటున్నావు. వయ సులో చిన్నవాడివి, యువరక్తం అప్పుడే ఆమ్యా మ్యాలకై వెంపర్లాడుతున్నావేం?'' ఏకవచనంలోకి దిగుతూ చురకేశాడు.

తొట్రుపడలేదు రవిచంద్ర.

"ఫ్రెష్‌గా ఉద్యోగం సంపాదించాను కానీ సవ్యంగా జరగలేదది. ప్రజ్ఞ ఉండీ లంచం పెట్టాల్సి వచ్చింది. మరి నేనిచ్చిన డబ్బు తిరిగి సమకూర్చు కోవాలంటే అందినంతా దండుకోవాల్సిందేగా?'' అన్నాడు.

తడబడ్డాడు సూర్యనారాయణ.

"అయినా మీరు నీతులు వల్లించడమేంటండీ! ఇంటర్వ్యూకి వెళ్ళేముందు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అడిగారు. అది తెచ్చుకోవడానికి నానాతంటాలు పడాల్సి వచ్చింది. చివరికి ఆ సర్టిఫికెట్‌తో ఆర్డర్స్ వచ్చాయి. మీవ రకూ వచ్చేసరికి తప్పొప్పులు గుర్తొచ్చాయా?''

రవిచంద్ర మాటలు శూలాల్లా తగిలా మూర్తికి.

"నిజమే! తన కెరీర్‌లో ఎంతమంది నిరుద్యో గుల దగ్గర డబ్బు గుంజలేదు?''తొలిసారిగా అతని మనసులో తలెత్తిందా ప్రశ్న. వివర్ణమయ్యిందతని వదనం.

"మీలాంటివాళ్ళ వల్లనే సార్! నాలాగా ఉద్యో గంలో చేరిన నిజాయితీపరులు సైతం పెడతోవన పడుతున్నారు. తమ డబ్బు తాము రాబట్టుకోవడా నికి ఇలాంటివి అలవాటు చేసుకుంటున్నారు. నా తండ్రి ఎలాగైనా నాకీ ఉద్యోగం నాకు రావాలని కిరా ణాకొట్టులో గుమస్తాగా చేస్తూ ఆత్మహత్య చేసుకు న్నాడు. సహజమైన మరణంగా ధృవీకరించబడ డంతో వచ్చిన ఎల్ఐసి డబ్బులతో నేనీ కుర్చీలో..'' మధ్యలోనే రవిచంద్ర స్వరం మారిపోయింది. కంట తడిచేరింది. అదిరిపడ్డాడు మూర్తి. మొదటిసారి గుండె ప్రకంపితమైంది. గొంతు పెగుల్చుకుని "క్షమించుబాబూ!'' అని మాత్రం అనగలిగాడు.

ఆయనలోని పరివర్తనని గమనిస్తూ రవీంద్ర అన్నాడు.

"డబ్బుకి కక్కుర్తిపడి మీ చెక్కుని ఆపలేదు. ఎదుటివారి కష్టం తెలిసి రావాలని చేశానిలా. నాకు ఒక్క నయాపైసాతో పనిలేదు. నాకొచ్చే జీతం సంతృప్తికరంగా ఉంది'' అంటూ టేబుల్ సొరుగు లోంచి చెక్కు తీసి మూర్తిచేతికి అందించాడు రవి చంద్ర.

థ్యాంక్స్ చెప్పి బయటపడ్డాడు మూర్తి.

* * *

అదీ జరిగింది.

సూర్యనారాయణమూర్తి మాత్రం రవిచంద్రతో ముభావంగానే ఉండిపోయాడు. పెళ్లిచూపులు తతంగం అవిఘ్నంగా జరిగింది.

వధూవరులిద్దరూ పరస్పరం ఇష్టపడ్డారు.

వెళ్లిపోయేముందు మూర్తి ఏకాంతంగా రవిచం ద్రతో మాట్లాడాడు.

"బాబూ! జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఈ సంబంధం దృష్ట్యా మళ్లీ మనం కలుసుకోవడం దైవికమే. మా అందరికీ అమ్మాయి నచ్చింది. మీ చెల్లెలు నచ్చినందువల్లే మా ఇంటికోడల్ని చేసు కుంటున్నాం. కానీ కట్నం లేకుండా పెళ్లి జరుగు తుంది. మా అబ్బాయి గురించి మీరు అన్నీ వాకబు చేసుకుని, సంతృప్తి చెందాకే పెళ్లి జరిపిద్దాం. అన్ని చోట్ల వాకబు చేసుకోండి. నిర్ణయం మీ చేతుల్లో ఉంది'' అన్నారాయన.

రవిచంద్ర వదనం ప్రసన్నమైంది.

★